

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com




హైదరాబాద్ | బుధవారం 31-3-2021 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 199 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# ఢిల్లీలో రికార్డు స్థాయిలో ఎండలు

## మార్చిలో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

న్యూఢిల్లీ,మార్చి30(ఆర్ఎన్ఎ): దేశ రాజధాని ఢిల్లీలో ఎండలు మండుతున్నాయి. సోమవారం రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 76 సంవత్సరాల తర్వాత మార్చిలో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయినట్లు భారత వాతావరణశాఖ తెలిపింది. నగరంలోని సఫ్దర్‌జంగ్ అబ్జర్వేటరీలో గరిష్ఠ ఉష్ణోగ్రత 40.1 డిగ్రీలు నమోదైంది. ఇది సాధారణం కంటే ఏనిమిది రెట్లు ఎక్కువ అని భారత వాతావరణ శాఖ ప్రాంతీయ కేంద్రం అధిపతి కుల్దీప్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. 31 మార్చి 1945లో గరిష్ఠ ఉష్ణోగ్రత 40.5 డిగ్రీలుగా రికార్డయిందని, ఆ తర్వాత దేశ రాజధానిలో మార్చిలో ఇదే అత్యంత ఉష్ణోగ్రత ఉన్న రోజని చెప్పారు. అయితే గత మూడు నాలుగు రోజులుగా ఆకాశం నిర్మలంగా ఉండడం, గాలివేగం తక్కువగా ఉండడంతో ఉష్ణోగ్రతలు ఇంతలా నమోదయ్యాయని పేర్కొన్నారు. 1973, మార్చి 29న నగరంలో గరిష్ఠంగా 39.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని, ఇది మార్చిలో మూడో అత్యంత వేడిమి ఉన్న రోజన్నారు. నజాఫ్‌గఢ్, నరేలా, పితాంపురా, పూసాలోని వాతావరణ కేంద్రాల్లోవరుసగా 41.8 నుంచి 41.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని ఐఎండీ పేర్కొంది. ఇదిలా ఉండగా.. నగరంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 20.6 డిగ్రీలకు చేరాయి. ఇది సాధారణం కంటే మూడు రెట్లు ఎక్కువ. సాధారణం కంటే కనీసం 4.5 డిగ్రీల కంటే ఎక్కువగా ఉంటే.. 'హీట్ వేవ్'గా ప్రకటిస్తారు. సాధారణ ఉష్ణోగ్రత నుంచి 6.5 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా ఉంటే 'తీవ్రమైన' వేడిగాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. గంటకు 35 కిలోమీటర్ల వేగంతో వీచే బలమైన గాలులు మంగళవారం గరిష్ఠ ఉష్ణోగ్రతను 38 డిగ్రీలకు పడిపోతుందని శ్రీవాస్తవ పేర్కొన్నారు.

# దేశంలో ఆగని కరోనా విజృంభణ

## పెరుగుతున్న కేసులతో ప్రజల్లో ఆందోళన

## రెండో డోస్ వ్యాక్సిన్ వేసుకున్న హర్షవర్ధన్ దంపతులు

న్యూఢిల్లీ,మార్చి30(ఆర్ఎన్ఎ): కరోనా సెకండ్ వేవ్ దేశంలో వేగంగా విస్తరిస్తున్నది. కొత్త కరోనా కేసుల సంఖ్య భారీగా పెరుగుతున్నది. ముఖ్యంగా ఆరు రాష్ట్రాల్లో కరోనా పాజిటివ్ కేసులు మరీ ఎక్కువగా నమోదవుతున్నాయి. గడిచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 56,211 కొత్త కేసులు నమోదు కాగా, అందులో 78.56 శాతం కేసులు మహారాష్ట్ర, పంజాబ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లోనే బయటపడ్డాయని కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంగళవారం ఉదయం వెల్లడించింది. దేశవ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో కరోనా బారినపడిన 56,211 మంది బాధితుల్లో మహారాష్ట్రకు చెందిన వారు 31,643 మంది, పంజాబ్‌కు చెందిన వారు 2,868 మంది, కర్ణాటకకు చెందిన వారు 2,792 మంది, మధ్యప్రదేశ్‌కు చెందిన వారు 2,323 మంది, తమిళనాడుకు చెందిన వారు 2,279 మంది, గుజరాత్‌కు చెందిన వారు 2,252 మంది ఉన్నారని కేంద్ర ఆరోగ్యశాఖ తెలిపింది. ఇదిలావుంటే కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ మంగళవారం కోవిడ్ టీకా రెండో డోసు తీసుకున్నారు. సతీమణి నూతన్ గోయల్‌తో కలిసి ఢిల్లీలోని హార్ట్ అండ్ లంగ్ ఇన్‌స్టిట్యూట్‌లో దేశీయంగా అభివృద్ధి చేసిన కొవాగ్జిన్ టీకా వేయించుకున్నారు. ఇంతకు ముందు ఈ నెల 2న వ్యాక్సిన్ తొలి డోసు తీసుకున్నారు. మళ్లీ 28 తర్వాత ఆయన మంగళవారం రెండో డోసు తీసుకున్నారు. కొవాగ్జిన్ టీకాను హైదరాబాద్‌కు చెందిన



భారత్ బయోటెక్ కంపెనీ అభివృద్ధి చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాక్సిన్ మొదటి డోసు తీసుకున్న తర్వాత తమకు ఎలాంటి దుష్ప్రభావాలు కలుగలేదన్నారు. రెండు భారతీయ టీకాలు సురక్షితం, ప్రభావవంతమైనవని స్పష్టంచేశారు. టీకాలపై ఇప్పటికీ చాలా మందిలో సందేహాలు ఉన్నాయని, సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ టీకాలు తీసుకోవాలని కోరారు. టీకాలు తీసుకున్న వారిలో కొందరికి సైడ్ ఎఫెక్ట్స్ అరుదైన సందర్భాలు మాత్రమేనని.. టీకాలు తీసుకున్న తర్వాత కరోనా సోకే, ఆసుపత్రుల్లో చేర్పించే అవకాశాలను తగ్గిస్తుందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. దేశంలో జనవరి 16న ప్రారంభించిన వ్యాక్సిన్ డ్రైవ్ నుంచి ఇప్పటి వరకు దేశంలో 6,11,13,354 డోసులు వేసినట్లు మంత్రిత్వశాఖ తెలిపింది.

# నిరంతర విద్యుత్ ఘనత సీఎం కెసిఆర్‌దే

## సాగర్‌లో గెలుపు టిఆర్ఎస్‌దే

## మరోమారు ఆదరించాలన్న మంత్రి జగదీశ్వర్ రెడ్డి

నాగార్జునసాగర్,మార్చి30(ఆర్ఎన్ఎ): సాగర్ ఎన్నికల్లో టిఆర్ఎస్‌దే విజయమని, మిగతా పార్టీలకు డిపాజిట్లు కూడా దక్కవని మంత్రి జగదీశ్వర్ రెడ్డి అన్నారు. నిడమనూరులో టిఆర్ఎస్ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రజలు అభివృద్ధిని కరుకుంటున్నారని అన్నారు. ఎండాకాలంలో సైతం తెలంగాణలో నిరంతరంగా 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తోంది సిఎం కెసిఆర్ మాత్రమేనని మంత్రి జగదీశ్వర్ రెడ్డి అన్నారు. సంక్షేమ కార్యక్రమాలను, రైతు కార్యక్రమాలను అమలు చేస్తున్నది కూడా తెలంగాణ ప్రభుత్వం మాత్రమే నన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్ సంక్షేమ అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. రైతులకు ఎకరానికి రూ10 వేల పెట్టుబడి, సీఎం కేసీఆర్‌ది ప్రజలందరికీ పారదర్శకంగా నిలిచే రామరాజ్య పాలన అని అన్నారు. రైతులు ఏవిధంగా మరణించినా రూ, 5 లక్షల బీమా అందిస్తోంది కేసీఆరే నన్నారు.

మిషన్ కాకతీయలో చెరువులను అభివృద్ధి పరచారన్నారు. చెరువులకు నీళు కావాల్నా.. రైతుబీమా కావాలన్నా.. కెసిఆర్ కారణమని తెలిసిపోయిందన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఓవైపు సంక్షమ పథకాలను అమలు చేస్తూనే అభివృద్ధిలోనూ అగ్రగామిగా రాష్ట్రాన్ని నిలుపుతున్నారన్నారు. ఎన్నికల్లో మరోమారు కారుగుర్తుపై ఓటు వేయాలన్నారు. ఇకపోతే అన్ని వర్గాల వారికి చేయూత నందిస్తున్న సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం పెంచారని అన్నారు. దేశంలోనే అభివృద్ధి పరంగా సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని నంబర్‌వన్ స్థానంలో నిలిపి ఉత్తమ సీఎంగా గుర్తింపు పొందారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక వృద్ధులకు వెయ్యి, వికలాంగులకు రూ.1500 పింఛన్లు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. తెలంగాణలో మరింత అభివృద్ధి జరుగాలంటే టీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలని ఆయన కోరారు.

# కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

## -అభ్యర్థుల ప్రచారంపై బృందాల నిఘా

నాగార్జునసాగర్,మార్చి30(ఆర్ఎన్ఎ): నాగార్జునసాగర్ నియోజకవర్గ ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకుడిగా సీనియర్ ఐఏఎస్ అధికారి విజయ్‌చౌదరిని ఎన్నికల సంఘం నియమించింది. నాగార్జునసాగర్ ఉప ఎన్నిక నేపథ్యంలో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు సూచించారు. మండలకేంద్రంలోని ప్రధాన రహదారిపై రెవెన్యూ, పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించారు. మద్యం, నగదు తరలింపుపై నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. సిబ్బందికి ఎన్నికల విధులను వివరించారు. ఎన్నికలను జిల్లాలో స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. నియోజకవర్గస్థాయిలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నామనీ, ప్రవర్తనా నియామవళి కోసం బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటితో పాటు ఫ్లయింగ్ స్కాడ్, వీడి యో వ్యూయింగ్ టీంలు ఉంటాయన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయవద్దన్నారు. ఎన్నికలను సైతం ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సమయం దాటిన తర్వాత ప్రచారం చేయరాదన్నారు. ఎన్నికల్లో ఓటర్లను తరలించడానికి ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసుకోరాదనీ, ప్రైవేటు ఆస్తులపై ప్రచారం చేయరాదని, ఒకవేళ చేసిన అ ఇంటి యాజమానిపై ఒప్పంద పత్రం తీసుకోవాలన్నారు. ప్రచారానికి సంబంధించి పాంప్లెట్స్, పోస్టర్లపైన ప్రింటింగ్ ప్రెస్ పేరు, అడ్రస్, ఫోన్ నంబర్‌తో పాటు, వాటిని ఎవరూ అచ్చు వేయించారో వారి పేరు కూడా ఉండాలన్నారు. ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను అందరు పాటించాలన్నారు. ప్రతి రాజకీయ నాయకుడు కుల, మతాల పరంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదన్నారు. విమర్శలనేవి పథకాలపై మాత్రమే ఉండాలని, వ్యక్తిగత దూషణలు, ఆరోపణలు చేయరాదన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు తీయడానికి ప్రత్యేకంగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు.

## చరిత్రలో నేటినిజం




# బీఆర్కె భవన్‌లో కరోనా కలకలం

## గోప్యత పాటించిన కరోనా వచ్చిన వారు

హైదరాబాద్,మార్చి30(ఆర్ఎన్ఎ): నగరంలోని బీఆర్కేఆర్ భవన్‌లో కరోనా కలకలం రేపుతోంది. నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్లో పలువురు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కరోనా బారిన పడ్డారు. కాగా అధికారులు కరోనా పాజిటివ్ వచ్చిన విషయాన్ని గోప్యంగా ఉంచి ఆఫీసుకు వచ్చినట్లు తెలుస్తోంది. గడిచిన వారం రోజుల్లో పదుల సంఖ్యలో పాజిటివ్ కేసులు నమోదు అవడంతో ఉద్యోగులు, వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ క్రమంలో ఆఫీసుకు వచ్చి విధులు నిర్వర్తించాలని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

# పెళ్లికి ముఖం చాటేసిన యువకుడు

## -ఆత్మహత్య చేసుకున్న యువతి

హైదరాబాద్,మార్చి30(ఆర్ఎన్ఎ): నగరంలోని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో పెళ్లికి నిరాకరించినందుకు ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. గత రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో మనస్థాపానికి గురైన యువతి ఆత్మహత్య చేసుకుంది. మరెడ్డి అషేర్ (20), తను గత ఒకటిన్నర సంవత్సరాలుగా ప్రేమించుకున్నామని, కానీ ఇప్పుడు పెళ్లి చేసుకుంటే ముఖం చాటేస్తున్నాడని యువతి మనస్తాపానికి గురైంది. గతంలో వీరు పెద్దలకు తెలియకుండా సంఘీ టెంపుల్‌లో వివాహం చేసుకున్నారు. పెద్దలు ఆ పెళ్లిని నిరాకరించి ఇద్దరిని వేరుచేశారు. అయినా వీరిద్దరూ అప్పుడప్పుడు కలుస్తూ ఉండేవారు. పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుంటానని మరెడ్డి అషేర్(20) నమ్మబలికాడు. కానీ ఎప్పుడు పెళ్లి చేసుకోమనడంతో అషేర్ ముఖం చాటేశాడు. దీంతో యువతి ఆత్మహత్య చేసుకుంది. తన ఫోన్లో సూసైడ్ చేసుకునే ముందు కొన్ని సెల్ఫీ వీడియోలు తీసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

# పెరుగుతున్న కరోనా కేసులు

## మరో నలుగురు మృతి చెందినట్లు ప్రకటన

హైదరాబాద్,మార్చి30(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రంలో కరోనా కేసులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. తాజాగా గడిచిన 24 గంటల్లో కొత్తగా 463 కరోనా కేసులు నమోదయ్యాయి..కరోనా వైరస్ వల్ల సోమవారం నలుగురు మృతి చెందారు. ఇప్పటి వరకు తెలంగాణలో 3,07,205కు కరోనా కేసులు చేరగా.. కరోనాతో 1,694 మరణాలు సంభవించాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 4,678 యాక్టివ్ కేసులు ఉండగా.. కరోనా నుంచి 3,00,833 మంది రికవరీ అయినట్లు మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేసిన హెల్త్ బులిటెన్?లో పేర్కొంది. రాష్ట్రంలో కరోనా కేసులు పెరుగుతుండటంతో పలు జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వ అధికారులు, వైద్యులు సూచిస్తున్నారు.

# నామినేషన్లు దాఖలు చేసిన భగత్, జానా

## పరిమిత సంఖ్యలో అనుచరులకు అనుమతి

నాగార్జునసాగర్,మార్చి30(ఆర్ఎన్ఎ): నాగార్జున సాగర్ ఉప ఎన్నికల్లో భాగంగా టీఆర్ఎస్ అభ్యర్థి నోముల భగత్ కుమార్



నిడమనూరు ఎమ్మార్వో కార్యాలయంలోనామినేషన్‌ను దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు మహమూద్ అలీ, జగదీశ్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్య యాదవ్, భాస్కర్ రావు, ఎమ్మెల్సీ తేరా చిన్నప రెడ్డితో పాటు పలువురు నాయకులు హాజరయ్యారు. కొవిడ్ నిబంధనల నేపథ్యంలో భగత్ నామినేషన్ దాఖలు కార్యక్రమం సాదాసీదాగానే సాగిపోయింది.

సాగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నామినేషన్ల దాఖలుకు నేటి మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు ఉంది. ఈనెల 31న నామినేషన్ల పరిశీలన.. చేపట్టనున్నారు. ఏప్రిల్ 3 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఏప్రిల్ 17న ఎన్నికల పోలింగ్, మే 2న ఫలితం వెల్లడికానుంది.నాగార్జున సాగర్ అసెంబ్లీ స్థానం ఉప ఎన్నిక సందర్భంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు నిడమలూరు తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ వేశారు. నాగార్జున సాగర్ దివంగత ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య కుమారుడు భగత్ అధికార పార్టీ తెరాస అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ వేయడానికి తెరాస నేతలు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలో నిలిచిన మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జానారెడ్డి నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను ప్రలోభ పెట్టి ఓట్లు వేయించుకోవడం ప్రజస్వామ్యానికి హాని చేస్తుందన్నారు. దీనిపై ఈసీ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెదేపా తరఫున ముహ్వా అరుణ కుమారి నామినేషన్ దాఖలు చేశారు.

# సిఎం కెసిఆర్ ఇచ్చిన అవకాశం మరచిపోలేనేది

## కేసీఆర్ మా నాన్నకు సముచిత స్థానం కల్పించారు

## సాగర్ అభివృద్ధికి నర్సింహయ్య కృషి చేశారు.

## అదే బాటలో తానే నడుస్తానన్న భగత

## తెలంగాణ ప్రజలకు టిఆర్ఎస్ శ్రీరామరక్ష అన్న తలసాని

సూర్యాపేట,మార్చి12(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ జన్మలో మరిచిపోలేని అవకాశం ఇచ్చారని నాగార్జున సాగర్ టీఆర్ఎస్ అభ్యర్థి నోముల భగత్ వ్యాఖ్యానించారు. కేసీఆర్ మా నాన్నకు సముచిత స్థానం కల్పించారన్నారు. 2018లో సాగర్ ప్రజలు మా నాన్న నోముల నర్సింహయ్యను ఆదరించి గెలిపించారు, చివరి శ్వాస వరకు ప్రజల కోసమే పని చేశారని చెప్పారు. నెల్లికల్లు, కుంకుడు చెట్టు తండా లిఫ్ట్‌లు నిర్మాణమవుతు న్నాయన్నారు. మా నాన్న ఆశయాలను ముందుకు తీసుకొని పోతానని నోముల భగత్ పేర్కొన్నారు. నాగార్జున సాగర్ నియోజకవర్గ అభివృద్ధికి మా నాన్న నోముల నర్సింహయ్య ఎంతగానో కష్టపడ్డారు. సీఎం కేసీఆర్ మా నాన్నకు సముచిత స్థానం ఇచ్చారు. ఇప్పుడు నాకూ జన్మలో మరిచిపోలేని అవకాశం ఇచ్చారు. సీఎం కేసీఆర్‌ను ఒప్పించి మా నాన్న నర్సింహయ్య నియోజకవర్గానికి వరద కాల్వ, నిడమనూరుకు కోర్టును సాధించారు. నాగార్జున సాగర్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ఆయన ధ్యేయం. చివరి శ్వాస వరకు ప్రజల కోసమే పనిచేశారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కార్యక్రమానికి హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు, ముఖ్యనాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు భగత్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూరైతు సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని పథకాలు అమలు చేస్తుందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. గొల్ల కుర్మల అభివృద్ధికి సీఎం కేసీఆర్ గొర్రెలు పంపిణీ చేశారన్నారు. అన్ని వర్గల సంక్షేమం కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ప్రతి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగు నీరు సరఫరా చేసేందుకు సీఎం కేసీఆర్ సిద్దంగా ఉన్నారని వివరించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని అడుకుంటున్న కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ప్రజలను మోసం చేయబోయినా ప్రజలు తిరస్కరిం చారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 2009 ఎన్నికల్లో తండాలను గ్రామ పంచాయతీలుగా చేస్తామని ప్రకటించి ఎందుకు చేయలేదన్నారు. ఎన్నికల్లో సీఎం కేసీఆర్ హామీ ఇవ్వకుండే గిరిజన తండాలను గ్రామా పంచాయతీలుగా ఏర్పాటు చేశారన్నారు. సీఎం కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి బంగారు తెలంగాణ సాధన కోసం కృషి చేశారన్నారు. ఏడేళ్లలో జరిగిన అభివృద్ధి ఏమిటో.. 70 ఏళ్లలో జరిగిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు తెలుసునని చెప్పారు. తెలంగాణ వచ్చాక ఆకలి చావులపై విజయం సాధించామన్నారు. 2018లోనే జానారెడ్డి ప్రజలచేత తిరస్కరించబడ్డారని తెలిపారు. సీఎం కేసీఆర్ మాకు శ్రీరామరక్ష అని ప్రజలు భావిస్తున్నారన్నారు.చెప్పడానికి ఏమీ లేక జానారెడ్డి ఓటమిని అంగీకరించి ప్రచారానికి పోవద్దని చెబుతున్నారని మంత్రి అన్నారు.

# స్వల్పంగా తగ్గిన పెట్రో ధరలు

న్యూఢిల్లీ,మార్చి30 (ఆర్ఎ న్ఎ): పెట్రోల్, డీజిల్ ధరలను చమురు కంపెనీలు మంగళవారం స్వల్పంగా తగ్గించాయి. లీటర్ పెట్రోల్‌పై 22 పైసలు, డీజిల్‌పై 23 పైసల చొప్పున తగ్గాయి. దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ రూ. 90.56, డీజిల్ రూ. 80.87కి చేరింది.

ముంబైల్‌లో లీటర్ పెట్రోల్ రూ. 96.98, డీజిల్ రూ. 87.96, చెన్నైలో పెట్రోల్ రూ. 92.58, డీజిల్ రూ. 85.88, కోల్‌కతాలో రూ. 90.77, డీజిల్ రూ. 83.75, హైదరాబాద్‌లో రూ. 94.16, డీజిల్ రూ. 88.20కు తగ్గాయి. దేశంలో రికార్డు స్థాయికి చమురు ధరలు చేరగా.. ఇంతకు ముందు ఈ నెలలో వరుసగా రెండుసార్లు ధరలు తగ్గాయి.

# ఉక్కు అమ్మకంతో అంతా మంచే జరుగుతుంది

## గల్లా జయదేవ్‌కు కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ లేఖ

న్యూఢిల్లీమార్చి12(ఆర్ఎన్ఎ): విశాఖ ఉక్కుపై టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్‌కు కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి అనురాగ్ ఠాకూర్ లేఖ రాశారు.

ఉక్కు ప్రైవేటీకరణతో అందరికీ మంచే జరుగుతుందని తెలిపారు. స్టీల్ ఎ÷-లాంట్ ఉద్యోగుల ప్రయోజనా లను కాపాడతామని ఆ లేఖలో ఠాకూర్ వివరించారు. గతంలో జయదేవ్ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు రాసిన లేఖకు సమాధానంగా ఠాకూర్ ఈ లేఖ రాశారు. ఉక్కు సంస్థలో వంద శాతం పెట్టుబడులు ఉపసంహరించాలని కేంద్ర కేబినెట్ కమిటీ నిర్ణయం తీసుకుందన్నారు. ప్రైవేటీకరణవల్ల అంతా మంచే జరుగుతు ందని, ఉత్పత్తి పెరుగుతుందన్నారు. అందులో ఉద్యోగులు, భాగస్వామ్య పక్షాలకు న్యాయం జరిగే విధంగా అన్ని రకాలుగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఠాకూర్ లేఖలో స్పష్టం చేశారు.

# యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్ మధ్య 'మైత్రీ బంధం

## వారు నిరంతరంగా ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారు

## కేరళ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోడీ

తిరువనంతపురం,మార్చి12(ఆర్ఎన్ఎ): కొద్దిపాటి వెండి ముక్కల కోసం ఏసుక్రీస్తును జుడాస్ మోసగిస్తే, కొన్ని బంగారం ముక్కల కోసం ఎల్డీఎఫ్ ప్రభుత్వం కేరళ ప్రజలను మోసం చేసిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పాలక్కాడ్‌లో జరిగిన బహిరంగ సభలో మోదీ మంగళవారంనాడు మాట్లాడుతూ, కేరళ రాజకీయాల్లో చాలా ఏళ్లుగా యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్ మధ్య 'మైత్రీ బంధం' కొనసాగుతోందని, ప్రజలు ఇప్పుడు ఆ పార్టీల 'మ్యాచ్ ఫిక్సింగ్'ను ప్రశ్నిస్తున్నారని, వీళ్ల మోసాలను గమనిస్తున్నారని అన్నారు. పశ్చిమబెంగాల్‌లో కాంగ్రెస్, లెఫ్ట్ కలిసి పనిచేస్తున్నాయని, కేరళలో మాత్రం ప్రత్యర్థులుగా విమర్శలు గుప్పించుకుంటున్నారని అన్నారు. యూపీఏ-1లో భాగస్వామ్యం కొనసాగించిన లెఫ్ట్ పార్టీ, యూపీఏ-2లో అంశాల వారిగా కాంగ్రెస్‌కు సపోర్ట్ చేసిందని గుర్తు చేశారు. కేరళలో వామపక్షాలు చాలా సార్లు అధికారంలో ఉన్నాయని, కానీ వాళ్ల నేతలు ఇప్పటికీ జూనియర్ స్థాయి గూండాలుగా ప్రవర్తిస్తుంటారని ప్రధాని విమర్శించారు. వారి నేతృత్వంలో రాజకీయ ప్రత్యర్థులు హత్యలకు, నరికివేతలకు, దాడులకు గురయ్యారని అన్నారు. కేరళలో ఈ హింసకు తమ ప్రభుత్వం చరమగీతం పాడుతుందని పేర్కొన్నారు. కేరళ సంస్కృతిని, సంప్రదాయాలని యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్‌లు తుంగలోకి తొక్కుతున్నాయని, అమాయక భక్తులపై ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం లాఠీలీ ఝుళిపించిందని, ఇంత జరుగుతున్నా యూడీఎఫ్ మౌనంగానే ఉండిపోయిందని తప్పుపట్టారు. కేరళకూ, పర్యాటరంగానికీ అవినాభావ సంబంధం ఉందని, దురదృష్ట వశాత్తూ పర్యాటక రంగంలో మౌలిక వసతుల కల్పనకు ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ చేసిందేమీ లేదని అన్నారు. సాంకేతికతను జోడించడం ద్వారా కేరళ పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలని మోదీ అన్నారు. గత ప్రభుత్వాలు కనీస మద్దతు ధర ఇస్తామంటూ కేవలం హామీలే ఇచ్చేవని, తమ ప్రభుత్వం కనీస మద్దతు ధర పెంచిందని చెప్పారు. వ్యవసాయం, రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అనేక పథకాలు చేపట్టిందని తెలిపారు. కేరళలో సత్వర (ఫాస్ట్) అభివృద్ధికి సమయం ఆసన్నమైందని మోదీ అన్నారు.

# చీటర్ సుధాకర్ అరెస్ట్

హైదరాబాద్,మార్చి30(ఆర్ఎన్ఎ): చీటర్ సుధాకర్‌ని నార్త్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఉన్నతాధికారుల పేర్లు చెప్పి సుధాకర్ మోసాలకు పాల్పడుతున్నాడు. పెద్దపల్లికి చెందిన సుధాకర్ ఇప్పటి వరకూ కొన్ని వందల మందిని మోసం చేశాడు. ప్రభుత్వ పథకాలు ఇప్పిస్తానంటూ పెద్ద మొత్తంలో సుధాకర్ డబ్బులు వసూలు చేశాడు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని సుధాకర్ మోసాలకు పాల్పడుతున్నాడు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పేర్లు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నాడు. నకిలీ గన్‌మెన్‌లను పెట్టి ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తున్నాడు. అనేక రకాలుగా మోసాలకు పాల్పడి కోట్ల రూపాయలు వసూలు చేసిన సుధాకర్‌ని ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు

# సహకార సేవలను వినియోగించుకోవాలని మంత్రికి వినతి



హైదరాబాద్, మార్చి 30 : గ్రామీణాభివృద్ధి శాఖలో సహకార శాఖ అధికారుల సేవలను వినియోగించుకోవాలని సహకార శాఖ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నేతలు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కోరారు.

మంత్రిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మంగళవారం ఆ సంఘం ప్రతినిధులు, రాష్ట్ర సహకార శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసిషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ మోహన్ రావు, ప్రధాన కార్యదర్శి భీం రాజు, ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి, ఈగ వెంకటేశ్వర్లు, గంథం శ్రీనివాసరావు, నాగేశ్వర్‌రావు కలిశారు.

పీఆర్‌సీ ఇచ్చినందుకు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. గతంలో సహకార శాఖ నుంచి పలువురు అధికారులు వివిధ హోదాల్లో గ్రామీణాభివృద్ధి శాఖలో తమ సేవలందించారని, ప్రస్తుతం సైతం సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

## బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య..

సహకార సేవలను వినియోగించుకోవాలని మంత్రికి వినతి

మంత్రి ఎర్రబెల్లిని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (టీబీఎస్ఎస్ఎస్) నూతన కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిసింది. వరుసగా మూడోసారి ఈ కార్యవర్గం ఎంపికవడంపై సంఘం సభ్యులను అభినందించారు. మంత్రిని కలిసిన వారిలో వెన్నంపల్లి జగన్మోహన్‌రావు శర్మ ఆధ్వర్యంలో గౌరవ సలహాదారు బీ హన్మంతచారి, కార్యదర్శి నాగేశ్వర సిద్ధాంతి, మహిళా విభాగం అధ్యక్షురాలు దేవులపల్లి వాణి, రీజనల్ కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు తులసి శ్రీనివాస్, కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు తేరాల వాణి ఉన్నారు

# మోడీ రాజ్యకాంక్షకు బలవుతున్న ప్రజలు !

నేటినిజం

బుధవారం 31-3-2021

భారత రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీకి తిరుగులేదని చాటాలన్న తాపత్రయం మోడీలో బాగా బల పడింది. ఇది వ్యక్తిగతంగా తనకు లబ్ది చేకూర్చేలా ప్రధాని మోడీ పార్టీని గుప్పిట్లో పెట్టుకుని నడిపిస్తు న్నారు. అన్ని రాష్ట్రాల్లో అధికారంలో ఉంటే తప్ప తను అనుకున్న విధంగా ముందుకు సాగడం కుదరదు కనుక అందుకు ఎత్తులు వేస్తున్నారు. అయితే అన్ని రోజులు ఒకేలా ఉండకపోవచ్చు. దేశాన్ని ఎన్నో దశాబ్దాలు పాలించిన కాంగ్రెస్ కూడా మట్టి కరుచుకు పోయింది. బిజెపికి ఉన్న ఇమేజ్‌ను ఓ రకంగా మోడీ తన వ్యక్తిగత ప్రతిష్టకోసం మట్టిలో కలిపారు. మునపటి బిజెపికి ఉన్న ఇమేజ్ ఇప్పుడు లేదు. ఉద్దండులు కూడా పార్టీలో లేరు. మోడీ తాబేదార్లతో పార్టీ నిండిపోయింది. వాయిస్ లేని వాళ్లంతా పార్టీలో ఉన్నారు. తన అనుయాయులకు మేళ్లు చేకూర్చే పథకాల కోసం మోడీ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలకు సంకటంగా మారాయి. ఈ క్రమంలో రానున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కూడా మోడీ ప్రతిభకు పరీక్ష కానున్నాయి. ఇటీవల కేంద్రం వరుసగా తీసుకుంటున్న ప్రజావ్యతిరేక విధానాల ప్రభావం ఆయా రాష్ట్రాల్లో ఏ మేరకు ఉ ంటుందో చూడాలి. ప్రజలు వీటిపై స్పందిస్తారా లేక ఆదరిస్తారా అన్నది చూడాలి. మోడీ నిర్ణయాలపై ఐదు రాష్ట్రాల్లో ప్రభావం ఉ ంటుదన్న విషయం ప్రస్తుతం ప్రచారం జరుగు తున్న తీరు స్పష్టం చేస్తున్నది. ఒకప్పుడు ఎన్నికల రాజకీయాల్లో బిజెపి గురించి ఏ మాత్రం చర్చ జరిగేది కాదు. కాని ఇప్పుడు దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా బిజెపి పైనే చర్చ కేంద్రీకృతమవుతున్నది. ప్రజలు ఆదరిస్తారా లేదా అన్నది చూస్తున్నారు. సరిగ్గా అయిదేళ్ల క్రితం పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఒక శక్తి కూడా కాదు. మొత్తం 294 సీట్లలో బిజెపి కేవలం 3 సీట్లను గెలుచుకుంది. ఒకప్పుడు దేశాన్ని ఆరు దశాబ్దాలు ఏలిన కాంగ్రెస్ పార్టీ నేతలు రాహుల్, ప్రియాంక ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌లో అడుగు పెట్టేందుకే జంకుతుండగా, ఆ రాష్ట్రంలో బిజెపి పాగా వేసేందుకు వేయని ఎత్తులు లేవు. చేయని చిత్తులు లేవు. మమతా బెనర్జీని ఊపిరి పీల్చుకోకుండా చేస్తున్నారు. అయినా అనుకూలంగా పవనాలు వీస్తున్న ఛాయలు కనిపించడం లేదు. ఇకపోతే తమిళనాట ఉ త్తరాది పార్టీలను ఆదరించే సంస్కృతి లేదు. అక్కడి కేవలం 20 సీట్లలోనే పోటీ చేస్తున్నది. కేరళలో కూడా అంత ఈజీగా పరిస్థితి లేదు. అక్కడ వామపక్షాల కూటమి లేదా, కాంగ్రెస్ కూటమిలు అధికారాన్ని మార్చుకుంటున్నాయి. ఇక బెంగాల్లో అడుగులు వేసేందుకు మమత అనుయాయులను మొత్తంగా లాగేశారు. అందుకే తొలిదశ పోలింగ్ జరిగిన 30 సీట్లలో 26 సీట్లు బిజెపికే లభిస్తాయని ధీమాను వ్యక్తం చేస్తున్నారు. అయిదు సంవత్సరాల క్రితం అస్సాంలో కాంగ్రెస్‌ను గ్గద్దె దించి అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ రెండవసారి మళ్లీ అక్కడ విజయం కోసం పరితపిస్తున్నది. బిజెపి అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు తమకు అందుబాటులోకి రావడమే కాక, ఎలాంటి అవినీతి లేకుండా అభివృద్ధి అమలులోకి వస్తుందని దేశ పప్రజలు బాగా ఆశలు పెట్టుకున్నారు. ఎందుకంటే వాజ్‌పేయ్, అద్వానీ, మురళీమనోహర్ జోషి లాంటి వారంత ఉన్న పార్టీ కావడం, సైద్ధాంతిక నిబద్ధత కలిగిన పార్టీ కావడంతో అంతా ఆనందించారు. కానీ అదంతా భ్రమేనని మోడీ నిరూపించారు. మోడీ, అమిత్ షాలు కలసి పగ్గాలు చేపట్టాక ప్రజల్లో ఉన్న భ్రమలు,ఆశలు తొలగిపోయాయి. కాంగ్రెస్ అవినీతి అక్రమాలు చూశాక సహజంగానే ప్రజలు మార్పు కోరుకోరుకున్నారు. ఆ మార్పునకు నరేంద్రమోదీ సారథ్యంలోని బిజెపి ప్రభుత్వం దోహదం చేయగలదని విశ్వసించారు. దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలు, నిమ్న జాతులు అందరూ ఏకతాటిపైకి వచ్చి మోడీకి జై కొట్టారు. దేశంలో అభివృద్ధి ఫలాలు తమకు అందాలని అన్ని వర్గాల వారు భావించారు. అయితే మోడీ మాటల మనిషిగానే మిగిలి పోయారు.

తనలో ఉన్న బిజినెస్ మేన్ బయటకు వచ్చారు. గుజరాతీ వ్యాపారులకు మేలు చేయడం కోసం దేశాన్ని తాకట్టు పెట్టే పనిలో పడ్డారు. లాభదాయక ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ఉనికి లేకుండా చేస్తున్నారు. తనకు ఎదురు లేకుండా చేసుకోవాలంటే అన్ని రాష్ట్రాల్లో తన అధికారం చెల్లుబాటు కావాలి. అన్ని రాష్ట్రాల్లో పాదం మోపాలంటే, అతన అనుయాయ వ్యాపార దిగ్గజాలకు లబ్ది చేకూరాలంటే అధికారం తప్పనిసరి అని గుర్తించారు. అందుకే అన్ని రాష్ట్రాల్లో అధికారమే లక్ష్యంగా, అదే తన జీవిత లక్ష్యంగా మోడీ కష్టపడుతున్నారు. కాంగ్రెస్‌తో పాటు, కమ్యూనిస్టులు ఇప్పుడు డమ్మీ అయిపోయారు. ప్రాంతీయ పార్టీలు భారీ ఎత్తున కుంభకోణాలకు పాల్పడుతున్నాయి. వీటిని అడ్డం పెట్టుకుని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలను బెదిరింపు రాజకీయాలు చేపట్టారు. ప్రా÷-తీయ పార్టీల నేతలు కూడా ప్రజల సంక్షేమాన్ని విస్మరించాయి. దౌర్జన్యాలు చేయడం, డబ్బుల పెట్టి ఓట్లు వేయించుకోవడం, ముస్లింలను అదేపనిగా బుజ్జగింపు రాజకీయాలు చేయడం కూడా బిజెపి తనకు అనుకూలంగా మార్చుకుంది. బెంగాల్‌ను తీసుకుంటే వామపక్షాల ప్రభుత్వానికీ, మమతా బెనర్జీ పాలనకూ మధ్య ప్రజలు పెద్దగా తేడాను చూడలేక పోయారు. అక్కడ బిజెపి పుంజుకోవడం వెనక ప్రధాన కారణం అదేగా చెప్పుకోవాలి. అంతేగానీ బిజెపి ఏదో పొడుస్తుందని చెప్పుకోలేం. బిజెపి పాలిత అసోం, కర్నాటక, గుజరాత్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో అక్కడి ప్రజలకు ఒరిగిందేమీ లేదు. పశ్చిమ బెంగాల్ లేదా ఇతర రాష్ట్రల్లో బిజెపికి లభిస్తున్న ఆదరణ భారతీయ జనతాపార్టీ రాజ్యకాంక్షకు సంకేతంగా చూడాలి. అయితే అసోం, బెంగాల్,తమిళనాడు, కేరళ, పుదుచచేరిలలో ఏ మేరకు బిజెపిని ప్రజలు ఆదరిస్తారా చూడాలి. అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల దృష్టిని జాతీయ ప్రయోజనాలు, ప్రాంతీయ భద్రతను పరిశీలన చేయాలి. ధరల పెరుగుదల, గ్యాస్, పెట్రో ధరలు, జిఎస్టీ, కరోనా విపత్తు, బ్యాంకుల బాదుడు వంటి సమస్యలను ప్రజలు చర్చ చేయాలి. సాగు చట్టాలు, ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్మడంపై చర్చించాలి. భారతీయ జనతాపార్టీ అధికార దాహంతో దేశంలో అన్ని రాష్ట్రాల్లో విస్తరించాలని భావించడాన్ని అడ్డుకోవాలి. ఒకేదేశం, ఒకే ప్రజ అంటూ చేస్తున్న నినాదాల వెనక ఉన్న కుట్రలను ఛేదించాలి.

## కానిస్టేబుల్ ఆత్మహత్య

నల్లగొండ,మార్చి30(ఆర్ఎన్ఎ): విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్ సూసైడ్ చేసుకున్నాడు. అది కూడా ఖాకీ డ్రెస్ వేసుకొని ఉరివేసుకొని చనిపోయాడు. నల్గొండ జిల్లా మర్రిగూడ పోలీస్ స్టేషన్‌లో సైదులు అనే వ్యక్తి కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఏ సమస్య వచ్చిందో ఏమో గానీ.. ఆయన రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని తిరుమల దేవున్ని గుట్ట సమీపంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.

## భార్య ప్రియుడిపై వ్యక్తి దాడి

యాదాద్రి భువనగిరి,మార్చి30(ఆర్ఎన్ఎ): ప్రియుడితో సన్నిహితంగా ఉన్న భార్యపై భర్త దాడి చేశాడు. ఈ ఘటన మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలోని డాగ్ బంగ్లా ఏరియాలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది.

పట్టణానికి చెందిన బయ్యని నరసింహ స్టాంప్ వెండర్‌గా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే నరసింహ భార్య గత కొంతకాలం నుంచి మరొకరితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయం భర్త నరసింహకు తెలిసింది. దీంతో ప్రియుడితో తన భార్య సన్నిహితంగా ఉన్న సమయంలో వెళ్లి దాడి చేశాడు. భార్యతో పాటు తల్లిని, ప్రియుడిని పోలీసులకు అప్పగించాడు నరసింహ. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## నేరాల ఛేదన, నియంత్రణలో టెక్నాలజీ వినియోగంతో ముందుకుసాగుతున్న కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు



కరీంనగర్, మార్చి 30: (నేటినిజం ప్రతినిధి):సంచలనాత్మకమైన కేసుల ఛేదన, నేరాల నియంత్రణలో కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు టెక్నాలజీ వినియోగంతో ముందుకుసాగుతున్నారు. ఈ టెక్నాలజీ వినియోగంలో కమిషనరేట్‌లో అందుబాటులో ఉన్న అత్యాధునిక సాంకేతిక పరికరాలతో పాటు సిసి కెమెరాలు ప్రధాన పాత్రను పోషిస్తున్నాయి. జిల్లాల పునర్విభజన తర్వాత ఏర్పడిన కమిషనరేట్ ప్రారంభంలో ఏ ఒక్కసిసి కెమెరాలేని కమిషనరేట్ నేడు వేలాది సంఖ్యలో సిసి కెమెరాల ఏర్పాటుతో ముందుకుసాగుతున్నది.

ఈ మధ్యకాలంలో కమిషనరేట్ పరిధిలో ఛేదించబడిన ప్రతి నేర సంఘటనలో టెక్నాలజీ పాత్ర కీలకపాత్ర పోషించిన విషయం విదితమే. కమ్యూనిటి సిసి కెమెరాల ఏర్పాటుతోపాటు నేనుసైతం కార్యక్రమంలో సిసి కెమెరాలను ప్రజలభాగస్వామ్యంతో ఏర్పాటు చేయించడంలో పోలీసులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. కమిషనరేట్‌లోని అన్నివర్గాల ప్రజలు ఇదేస్ఫూర్తితో ముందుకుసాగితే ఎలాంటి నేరం జరిగినా, అలాంటి సంఘటనలను కొన్నిగంటల వ్యవధిలోనే ఛేదించడం సాధ్యమవుతుందనే విషయాన్ని అన్నివర్గాల ప్రజలు గుర్తించాల్సిన అవసరం ఉంది. పోలీస్‌శాఖ అమలు చేస్తున్న డయల్ 100, షీటీం నెంబర్ 9440795122, హాక్ఐ యాప్ నెంబర్లను అన్నివర్గాల ప్రజలు డౌన్‌లోడ్ చేసుకోవాలి. స్మార్ట్‌ఫోన్ కలిగిన ప్రతిపౌరుడు హాక్ఐ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. హాక్ఐ యాప్ గోల్డెన్‌పికాక్ అవార్డునకు ఎంపికై తన పనితనాన్ని దేశవ్యాప్తంగా చాటింది. ఈ హాక్ఐ యాప్‌లో మహిళల భద్రతకోసం పలు ప్రత్యేక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ఏప్రిల్ నెల పూర్తయ్యే సరికి కమిషనరేట్‌లోని ప్రతి గ్రామంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పోలీస్‌శాఖ ముందుకుసాగుతోంది. నేనుసైతం కార్యక్రమంలో ఏర్పాటవుతున్న సిసి కెమెరాలతోపాటు కమ్యూనిటి సిసి కెమెరాల ఏర్పాటులో అన్నివర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకువస్తున్నారు. సిసి కెమెరాల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలపై పోలీసులు అన్నివర్గాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. హాస్టళ్ల నిర్వాహకులు కనీస నియమనిబంధనలను పాటించకపోవడం వల్ల విద్యార్థులు, వివిధ సంస్థల్లో పనిచేస్తున్న వారు క్రమశిక్షణతో మెదలడం లేదనే విషయం దృష్టికి వచ్చిందని తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులు, వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల నిర్వాహకులు రాత్రివేళల్లో బయటకు పంపకూడదని సూచించారు. విద్యార్థులు, మహిళలు హాస్టళ్లలో చేరిన రోజునే వారికి సంబంధించిన వివరాలు, వారిని కలిసేందుకు వచ్చేవారి ఫోటోలను తీసుకుని, సదరు వ్యక్తులను మాత్రమే కలిసేందుకు అవకాశం కల్పించాలని చెప్పారు. కొన్ని హాస్టళ్లలో నేరస్థులు తలదాచుకోవడం, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు అనుమానాలు తలెత్తుతున్నాయని, సదరు హాస్టళ్ళపై రహస్యంగా విచారణ జరుపుతున్నామని పేర్కొన్నారు. వాచ్‌మెన్‌ను విధిగా ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన భాధ్యత హాస్టళ్ళ నిర్వాకులపై ఉందని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు సక్రమంగా విద్యాసంస్థలకు వెళుతున్నారా?లేదా? అనే విషయాన్ని గుర్తించేందుకు హాస్టళ్ళ నిర్వాహకులు హాజరును పరిశీలించాలని సూచించారు. విద్యార్థులు, మహిళలను కలిసేందుకు వచ్చేవారి వివరాలను రిజిష్టర్‌లో నమోదు చేయాలని పేర్కొంటున్నారు.

## విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై హైకోర్టులో పిల్

### -దాకలు చేసిన మాజీ జెడి లక్ష్మీనారాయణ

అమరావతి,మార్చి12(ఆర్ఎన్ఎ): విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను సవాల్ చేస్తూ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్ బుధవారం విచారణకు రానుంది. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా కార్మిక, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాయి. ఈ నేపథ్యంలో కార్మికుల ఉద్యమానికి లక్ష్మీనారాయణ మద్దతు తెలిపారు. అంతేగాక స్టీల్ ప్లాంట్ లాభాల బాటలో నడవడానికి ఏం చేస్తే బాగుంటుందో కూడా తెలియజేస్తూ కేంద్రానికి లేఖ పంపారు. ఇదే సమయంలో వివిధ పార్టీల నేతలతో చర్చలు జరుపుతూ... కార్మికుల ఉద్యమానికి మద్దతు కూడగడుతున్నారు.

# మా'నవ' మనుగడ ప్రమాదంలో పడనుందా..!

(షన్నా హెచ్. స్వాన్ రచించిన 'కౌంట్‌డౌన్' పుస్తక వివరాల ఆధారంగా)

ఆధునిక విశ్వ మానవాళి పునరుత్పత్తి సమస్యలను ఎదుర్కోబోతున్నారని, పురుషుల్లో శుక్ర కణ గణన (స్పెర్మ్ కౌంట్) తగ్గడం, పురుషాంగం చిన్నది కావడం మరియు స్త్రీపురుషుల్లో పునరుత్పత్తి అభివృద్ధి దుష్ప్రభావానికి గురికావడం లాంటి పలు సమస్యలతో మానవ జాతి భవిష్యత్తు ఉనికి ప్రమాదంలో పడనుందని అమెరికా న్యూయార్క్‌కు చెందిన 'ప్రొఫెసర్ షన్నా హెచ్. స్వాన్ మరియు స్టాసీ కొలీనో' సంయుక్తంగా రచించిన పుస్తకం 'కౌంట్‌డౌన్' సారాంశంగా ఆసక్తికర విషయాలను తెలియజేస్తున్నది. ఎన్విరాన్‌మెంటల్ మెడిసిన్ మరియు పబ్లిక్ హెల్త్ విభాగంలో ప్రొఫెసర్‌గా అపార అనుభవం కలిగిన షన్నా హెచ్. స్వాన్ పరిశోధన ఫలితాల ఆధారంగా నవ్య మానవ జాతి జీవనశైలిలో వచ్చిన మార్పుల కారణంగా కొన్ని రసాయనాలు శరీరంలోని హార్మోన్లకు అంతరాయం కలిగిస్తూ పునరుత్పత్తి సామర్థ్యాన్ని తగ్గిస్తున్నాయనే భయానక వాస్తవాన్ని వెల్లడించింది. పర్యావరణ కాలుష్యం, ప్రమాదకర రసాయనాలు మరియు వాతావరణ అననుకూల మార్పుల ఫలితంగా స్త్రీపురుష పునరుత్పత్తి అవయవాలు అసాధారణ మార్పులకు గురికావడం జరుగుతుందని తెలియజేశారు. 2045 నాటికి స్త్రీపురుష జంటలు ప్రత్యామ్నాయ పునరుత్పత్తి మార్గాలను (సంతానసాఫల్య కేంద్రాలు) అన్వేషిస్తారని వివరించారు. గత 40 ఏండ్లలో పురుషుల స్పెర్మ్ కౌంట్ సగానికి పైగా తగ్గడం గమనించారు. 35 ఏండ్లు దాటిన స్త్రీలలో సంతానోత్పత్తి క్షీణత గమనించామని, గర్భస్రావ రేటు పెరుతోందని హెచ్చరించారు.

ఆధునిక వేగవంతమైన మానవ జీవనశైలిలో మనం వాడే వస్తువుల ద్వారా వెలువడే రసాయనాలు శరీరంలోని పునరుత్పత్తికి దోహదం చేసే టెస్టోస్టెరాన్ మరియు ఈస్ట్రోజెన్ లాంటి హార్మోన్లను అనుకరించడంతో సంతానోత్పత్తి మందగించడం గమనించారు. ఆహార పదార్థాల ప్యాకింగ్, తయారీ మరియు ప్రాసెసింగ్‌లలో వాడే సాఫ్ట్ ప్లాస్టిక్‌లలో వెలువడే 'థాలేట్' రసాయనాలు అతి ప్రమాదకరంగా మారుతూ తొందరగా యుక్తవయస్సు రావడం, గర్భస్రావాలు పెరగడం, అండాశయ వైఫల్యం, అకాల ప్రసవాలు లాంటి దుష్పరిణామాలు కనిపిస్తాయని వెల్లడించింది. హార్డ్ ప్లాస్టిక్స్, ఆహార నిల్వ పాత్రలు మరియు ఏటియంలలో వాడే నగదు రసీదుల్లో వెలువడే 'బిస్‌ఫినాల్-ఏ' రసాయనం వల్ల పురుషుల్లో స్పెర్మ్ కౌంట్ (శుక్ర గణన) తగ్గడం, జననేంద్రియ కాన్సర్ రావడం మరియు స్త్రీలలో సంతానోత్పత్తి తగ్గడం గమనించారు. ఈ రసాయనం వల్ల పురుషుల్లో అంగస్తంభన సమస్య, శుక్ర కణ నాణ్యత తగ్గడం, కామేచ్ఛ పడిపోవడం జరుగుతుంది. ఇదే రకమైన దుష్ఫలితాలను ఫ్లేమ్ రిటార్డెంట్లు మరియు కొన్ని పెస్టిసైడ్లు (అట్రాజిన్ లాంటివి) కూడా కలిగిస్తాయని గమనించాలి. బాల్యం, కౌమారదశ మరియు యుక్త వయస్సులలో ఇలాంటి ప్రమాదకర రసాయనాలకు లోనైనపుడు పురరుత్పత్తి అవయవాలు ప్రతికూలంగా ప్రభావితం అవుతాయి. ఆనస్ (గుదము లేదా అపానము) మరియు జననేంద్రియాల మధ్య దూరం (ఆనోజెనిటల్ డిస్టాన్స్) పునరుత్పత్తి సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తాయి. థాలేట్ రసాయనాలు ప్రభావితం చేసే ఈ దూరం పురుషుల్లో తక్కువగా ఉన్నపుడు పురుషాంగం చిన్నది కావడంతో పాటు సంతానోత్పత్తి రేటు కూడా తగ్గుతుందని మరియు స్త్రీల్లో ఈ దూరం ఎక్కువగా ఉన్నపుడు కూడా సంతానోత్పత్తి తగ్గుతుందని తెలిపారు. హార్మోన్లకు అంతరాయం కలిగించే ఇలాంటి రసాయనాల వల్ల 1960 నుంచి 2018 వరకు ఏడాదికి ఒక శాతం చొప్పున సంతానోత్పత్తి రేటు తగ్గడం గుర్తించారు. 2000 నుంచి 2016 మధ్య కాలంలో పిల్లల్లో ఏడాదికి 1.1 శాతం మూగవ్యధి (ఆటిజమ్ స్పెక్ట్రమ్ డిసార్డర్) పెరగడం గమనించారు.

మానవాళి తరుచుగా వాడే సాఫ్ట్ మరియు హార్డ్ ప్లాస్టిక్ వస్తువుల్లో ఇలాంటి హార్మోన్లను ప్రభావితం చేసే ప్రమాదకర రసాయనాలు లేకుండా చూసుకోవడం, ప్రాసెస్డ్ ఆహారానికి దూరంగా ఉండడం, క్యారెట్/పొటాటో లాంటి ముడి కూరగాయలను (రా వెజిటెబుల్స్) వాడడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ఆహారాన్ని ప్లాస్టిక్‌లో నిలువ ఉంచకపోవడం, థాలేట్లు/బిస్‌ఫినాల్‌లకు బదులు సురక్షిత ప్రత్యామ్నాయ రసాయనాలు వాడడం, టెఫ్లాన్ కోటింగ్ లేని పాత్రల్లో వండడం, ప్లాస్టిక్ పాత్రలను ఓవెన్‌లో పెట్టకపోవడం, ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ వినియోగాన్ని నిషేధించడం, ఎలక్ట్రానిక్ ఉపకరణాల వాడకాన్ని తగ్గించడం లాంటి చర్యలు ఆరోగ్య సమస్యల తీవ్రతలను తగ్గిస్తాయి. గర్భిణి స్త్రీలు ఇలాంటి రసాయనాలకు మాత్రమే కాకుండా గాలి కాలుష్యానికి, ప్లాస్టిక్ పాక్డ్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

ఆధునికత పేరుతో నవ్య మానవుడు తన గోతిని తానే తవ్వుకోవడం జరుగుతోందని, దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలనే భావనను మేలుకొలిపి సుందర సుమధుర భవిష్యత్తుకు పునాదులు వేసుకుందాం. ఆరోగ్య పరిరక్షణ వైపుకు నవ్య యువ అడుగులు పడాలని ఆశిద్దాం. మన అస్థిత్వానికి మనమే పట్టం కడదాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# వేడెక్కిన నందగ్రామ్ ప్రచారం



### మమత దూకుడుకు అడ్డుకట్ట పడేనా?
### బిజెపి అభ్యర్థి సుబేందు అధికారి చక్రం తిప్పేనా
### ఇక్కడ గెలిచి నిలవాలని చూస్తున్న సిపిఎం
### ఎప్రిల్ 1న తీర్పు ఇవ్వనున్న ప్రజలు

కోల్‌కతా,మార్చి30(ఆర్ఎన్ఎ): బెంగాల్లో ప్రధాన పార్టీలైన టిఎంసి, బీజేపీలు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నాయి. సాయంత్రం 5 గంటలతో రెండో విడత ప్రచారం ముగుస్తుంది. మొత్తం 30 నియోజక వర్గాల్లో ఏప్రిల్1న ఎన్నికలు జరగనున్నాయి. ఈ 30 నియోజకవర్గాల్లో మమతా బెనర్జీ పోటీ చేస్తున్న నందిగ్రామ్ నియోజకవర్గం కూడా ఉంది. నందిగ్రామ్ లో జరిగే ఎన్నికలపైనే అందరి దృష్టి ఉ న్నది. పశ్చిమ బెంగాల్‌లో తొలివిడత ఎన్నికలు ఇప్పటికే ముగిశాయి. రెండో విడత ఎన్నికలు ఏప్రిల్ 1 వ తేదీన జరగ బోతు న్నాయి. తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ, తృణమూల్ నుంచి బయటకు వచ్చి బీజేపీలో చేరిన ముఖ్యనేత సువేందు బెనర్జీ మధ్య ప్రధాన పోటీ ఉన్న సంగతి తెలిసిందే. గతంలో నందిగ్రామ్ నుంచి సువేందు అధికారి పోటీ చేసి భారీ విజయం సాధించారు. అయితే, ఇప్పుడు ఆయన బీజేపీలో జాయిన్ కావడం, బీజేపీ నుంచి పోటీ చేస్తుండటంతో ఉత్కంఠత నెలకొంది. మమతా బెనర్జీని 50 వేల మెజారిటీతో ఓడిస్తానని సువేందు అధికారి ఛాలెంజ్ చేసిన సంగతి తెలిసిందే. నామినేషన్ దాఖలు చేసే ముందు మమత కీలక వ్యాఖ్యలు చేసింది.

ప్రజలు కాదంటే తాను పోటీ నుంచి తప్పుకుంటానని ప్రకటించింది. ముఖ్య మంత్రి, కీలక నేతల మధ్య ఏప్రిల్ 1 వ తేదీన నందిగ్రామ్ సాక్షిగా మహాసంగ్రామం జరగబోతున్నది. పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్‌లో ఎన్నికల ప్రచారం వేడెక్కుతోంది.

రాష్ట్రంలోని ఏ నియోజకవర్గానికి లేనంత ప్రాముఖ్యత ఈ నియోజకవర్గం సంతరించుకుంది. దీనికి కారణం ముఖ్యమంత్రి, తృణమూల్ అధినేత మమతా బెనర్జీతో పాటు ఆమెకు కుడి భుజంగా వ్యవహరించి... ఇప్పుడు అనేక ఆరోపణలు చేసి... బిజెపి గూటికి చేరిన సువేందు అధికారి ఒకరిపై ఒకరు పోటీకి దిగడం సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే వీరిద్దరినీ తట్టుకుంటూ... వామపక్ష అభ్యర్థిగా బరిలోకి దిగిన , డివైఎఫ్ఐ యూత్ లీడర్ మీనాక్షి ముఖర్జీ ప్రచారంలో వారికి పోటీగా దూసుకు వెళుతున్నారు. బిజెపి, తృణమూల్ నేతలు... ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ పార్టీ ప్రచారాలు చేసుకుంటుంటే...మీనాక్షి మాత్రం తనదైన శైలిలో ప్రచారంలో సాగుతున్నారు. ఆర్థిక బలం లేకపోయినప్పటికీ... సాదాసీదాగా నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ... వారి యోగక్షేమాలు, కష్టసుఖాలను అడిగి తెలుసుకుంటున్నారు. మిగతా అభ్యర్థుల ప్రచారంలో ఉండే హంగులు, ఆర్భాటాలు లేకుండానే ఆమె గడగడపకూ వెళ్లి ప్రచారం చేస్తున్నారు. సిపిఎం అభ్యర్థి మీనాక్షికి నందిగ్రామ్-2లో చొచ్చుకుపోయిందని, భారీగా ఓట్లు కూడగట్టనున్నారని, ఈ ప్రభావం బిజెపిపై పడు తుందని లెఫ్ట్ నేతలు వ్యాఖ్యానించారు. అయితే ప్రజల అవసరాలు తీర్చడమే తన ముందున్న లక్ష్యమని చెబుతున్న మీనాక్షి... ప్రజలు ఆహారం, జీవనోపాధి కోసం అలమటించకూడదని తాను కోరుకుంటున్నట్లు తెలిపారు. నందిగ్రామ్‌లో త్రిముఖ పోటీ నెలకొన్నప్ప టికీ...ముఖర్జీ పెద్ద సవాళ్లను ఎదుర్కోవలసి ఉంటుంది. ఇద్దరు రాజకీయ ఉద్దండులకు దీటుగా ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. బిజెపి, తృణమూల్ వంటి పార్టీలు.. ఓటర్లకు డబ్బు ఎరవేస్తున్నా యని... స్వేచ్ఛాయుతంగా ఓట్లు వేయండని ప్రజలను కోరితే.... ఓట్లు తమకే వస్తాయని తెలిపారు. తమ పార్టీ బలం పుంజుకున్నందున తిరిగి తమ పార్టీకి ఆదరణ వస్తుందని సిపిఎం నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## కిడ్నాపైన బాలికను యూపిలో పట్టుకున్న పోలీసులు

ఖమ్మం,మార్చి30(ఆర్ఎన్ఎ): జిల్లాలోని ఎర్రుపాలెం మండలం రేమిడిచర్ల గ్రామానికి చెందిన వెల్లంకి రాజశ్రీ అనే బాలిక గతేడాది డిసెంబర్ 17న కిడ్నాప్ కు గురైంది. కిడ్నాప్ అయిన ఆ బాలిక ఆచూకీ ఉత్తరప్రదేశ్‌లో లభ్యమైంది. ఎర్రుపాలెం ఎస్ఐ ఉదయ్ కిరణ్ చాకచక్యంగా వ్యవహరించి బాలికను కిడ్నాప్ చేసిన నిందితులను అరెస్టు చేశారు. మైనర్‌ను సురక్షితంగా రేమిడిచర్లకు తీసుకొచ్చారు ఎస్ఐ.

రేమిడిచర్లలో క్షుద్ర పూజలు నిర్వహించేందుకు వచ్చిన గుంటూరు పూజారి సూర్య ప్రకాష్ శర్మ మాయమాటలు చెప్పి బాలికను కిడ్నాప్ చేసినట్లుగా విచారణలో తేలింది. ఈ కేసును చేధించి.. నిందితులను పట్టుకుని, బాలికను సురక్షితంగా తీసుకొచ్చిన ఎస్ఐ ఉదయ్ కిరణ్‌ను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

## ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి: మంత్రి ఎర్రబెల్లి



హైదరాబాద్, మార్చి 30: తెలంగాణ పంచాయితీ కార్యదర్శుల సంఘం డైరీని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆవిష్కరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో డైరీని ఆవిష్కరించి, మాట్లాడారు. జూనియర్ పంచాయతీ అధికారులకు వేతనాలు పంచాయతీ అధికారులతో సమానంగా ఇస్తున్నారన్నారు. ఇంకా కష్టపడి పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా పని చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా.. స్పందించిన ఆయన ప్రభుత్వానికి నివేదించి తగిన నిర్ణయం తీసుకుంటామని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

మంత్రిని కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, పంచాయతీరాజ్ సర్వీస్ అధ్యక్షుడు కే రాఘవేందర్‌రావు, ఎంపీడీఓల సంఘం అధ్యక్షుడు సత్తయ్య, మినిస్టీరియల్ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

## మాస్కు ధరించకుంటే చర్యలు తప్పవు

### -స్వయంగా సిఐకి మాస్కు తొడిగిన ఎస్ఐ

గుంటూరు,మార్చి30(ఆర్ఎన్ఎ): దేశంలో మరోమారు కరోనా మళ్లీ విజృభిస్తున్న నేపథ్యంలో అందరూ మాస్క్ వాడటం తప్పనిసరి చేసుకోవాలని గుంటూరు అర్బన్ ఎస్పీ అమ్మిరెడ్డి హెచ్చరించారు. అర్బన్ పరిధిలో మాస్కు ధరించని వారిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. లాడ్జికూడలి, ఎంటీబీ కూడలిలో స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. లాడ్జి కూడలిలో తుళ్లూరు ట్రాఫిక్ సీఐ మల్లికార్జునరావు మాస్కు ధరించకుండా అటుగా వెళ్లడం ఎస్పీ గుర్తించారు. వేంటనే సీఐని ఆగమని కరోనా వైరస్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో అందరూ తప్పని సరిగా మాస్క్ ధరించాలి మీరు ఎందుకు మాస్క్ ధరించలేదని ప్రశ్నించగా సీఐ హడావిడిలో మర్చిపోయాను సార్ అనిచెప్పారు. దీంతో తుళ్లూరు ట్రాఫిక్ సీఐ మల్లి మల్లికార్జునరావుకు ఎస్పీ అమ్మిరెడ్డి జరిమానా విధించి, స్వయంగా మాస్కు తొడిగారు. కరోనా వైరస్ ఉధృతంగా వ్యాప్తిచెందుతున్న క్రమంలో పోలీసులు సైతం జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ సూచించారు. మాస్కు ధరించని కారణంగా సీఐకి అపరాధ రుసుం విధించాలని అధికారులను ఆదేశించారు. అంతేకాదు ఎస్పీ స్వయంగా మాస్కు తెప్పించి సీఐకి తగిలించారు. అలాగే వాహనదారులను ఆపి, మాస్క్ ధరించకుండా రోడ్లపైకి రావొద్దని హెచ్చరించారు. మాస్కులు ధరించిన వారినే అనుమతించాలంటూ సమీపంలోని దుకాణదారులకు సూచించారు. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎస్పీ సూచించారు

## రాజధాని తరలింపు ప్రకటన సరికాదు

### -కేసు విచారణలో ఉండగా బొత్స వ్యాఖ్యలపై నిరసన

విజయవాడ,మార్చి30(ఆర్ఎన్ఎ): రాజధాని డ్రామాను వైసీపీ నేతలు రసవత్తరంగా నడిపిస్తున్నారు. ఏ క్షణంలోనైనా రాజధానిని తరలిస్తామని తాజాగా ప్రకటనలు చేస్తున్నారు. కోర్టులో ఉన్నదానిపై ఎలా మాట్లాడతారని రైతులు, విపక్ష పార్టీలు ప్రశ్నిస్తున్నాయి. మే 3వ తేదీ నుంచి ఏపీ రాజధాని పిటిషన్లపై

హైకోర్టు విచారణ ప్రారంభించనుంది. ఇంకా విచారణ ప్రారంభించకముందే మంత్రి బొత్స సత్యానారాయణ ఏ క్షణమైనా రాజధానిని విశాఖకు తరలిస్తామని ప్రకటనలు చేస్తున్నారు. అన్ని అవరోధాలను అధిగమిస్తామని చెబుతున్నారు. కానీ మంత్రి బొత్స ఏ ఉద్దేశంతో అలా అన్నారో కానీ రాజధాని విచారణ కేసులు మాత్రం ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. రాజధాని కేసులపై విచారణ మళ్లీ మే 3 నుంచి ప్రారంభమైనప్పటికీ మే 13 నుంచి జూన్ 13 వరకు హైకోర్టుకు వేసవి సెలవులు ఉన్నాయి. ఈ వేసవి సెలవుల అనంతరం మళ్లీ విచారణ జరగాల్సి ఉ ంటుంది. కనీసం 2 నుంచి 3 నెలలు విచారణ జరుగుతుందని అంటున్నారు. ఇదంతా మంత్రి హోదాలో ఉన్న బొత్సకు తెలియనిదికాదు. అయినప్పటికీ ఏ క్షణమైనా రాజధాని తరలింపు అంటూ ప్రకటనలు చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. చట్టం పట్ల నిర్లక్ష్యం తగదన్నారు.

.....

## బిజెపితో దేశానికి ముప్పు

### -వైకాపా ఎక్కువ రోజులు పాలనలో ఉండదు: చింతా

తిరుపతి,మార్చి30(ఆర్ఎన్ఎ): బీజేపీతో.. దేశానికి, దేశ భవిష్యత్తుకు ప్రమాదం వాటిల్లుతుందని తిరుపతి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డా.చింతా మోహన్ పేర్కొన్నారు. నాడు రాజశేఖర్ రెడ్డి తన స్వార్థ ప్రయోజనాల కోసం అనేక అడ్డదారులు తొక్కారని ఆరోపించారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి ఎక్కువ రోజులు అధికారంలో ఉండలేరని జోస్యం చెప్పారు. ఒక్క నామినేషన్‌కు మాత్రమే జగన్ మోహన్ రెడ్డి కోటి రూపాయలు మేరకు ఖర్చు చేశారని... ఈ డబ్బంతా ఎక్కడిదని ప్రశ్నించారు. దేశంలో కాంగ్రెస్ చేసినటువంటి అభివృద్ధి మరే ఇతర పార్టీలు చెయ్యలేదన్నారు. విశాఖ ఉ క్కుపై అందరూ పోరాటం చేస్తుంటే బీజేపీ కనీస సానుభూతి కూడా చూపడం లేదన్నారు.

## శ్రీవారి తలనీలాలను కూడా వదలడం లేదు

### -ట్విట్టర్ వేదికగా సిఎం జగన్‌పై అయ్యన్న ఫైర్

అమరావతి,మార్చి30(ఆర్ఎన్ఎ): తిరుమల శ్రీవారికి సమర్పించే తలనీలాలను కూడా స్మగ్లింగ్ చేయడం దారుణమని సీఎం జగన్ మోహన్‌రెడ్డిపై టీడీపీ నేత అయ్యన్నపాత్రుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అక్రమంగా తిరుమల శ్రీవారికి చెందిన తలనీలాలు ఇతర దేశాలకు తరలిస్తుండగా అస్సాం రైఫిల్స్ పోలీసులు పట్టుకున్నారంటూ ఆంగ్ల మీడియాలో వచ్చిన వార్తలపై అయ్యన్న ట్విట్టర్ వేదికగా స్పందించారు.

దోపిడీలో ఆయన దారే వేరయా! ఆఖరికి జుట్టు కూడా వదలడం లేదు జగన్ రెడ్డి అండ్ గ్యాంగ్. పరమ పవిత్రంగా భావించే తిరుమలలో వెంకన్నకి భక్తులు సమర్పించే తలనీలాలను కూడా స్మగ్లింగ్ చేస్తున్నారు జగన్ అండ్ కో. అక్రమంగా తిరుమల శ్రీవారికి చెందిన తలనీలాలు ఇతర దేశాలకు తరలిస్తుండగా అస్సాం రైఫిల్స్ పోలీసులు పట్టుకున్నారు. మొదట మైన్మార్, అక్కడ నుండి థాయ్ ల్యాండ్ మీదుగా చైనాకి శ్రీ వారి తలనీలాలు తరలిస్తున్నారు అని అక్కడి అధికారులు ప్రకటించారు. ఇప్పుడు పట్టుకున్నదే సుమారు 2 కోట్ల విలువైన తలనీలాలు అంటే ప్రతీరోజు శ్రీవారికి చెందాల్సిన ఎన్ని కోట్లు జగన్ రెడ్డి అండ్ గ్యాంగ్ కొట్టేస్తున్నారో అర్థం చేసుకోవచ్చని అంటూ అయ్యన్న ట్వీట్ చేశారు

## తప్పుడు హామీలకు మోసపోవద్దు.. ఎన్నికల ప్రచారంలో ప్రియాంకాగాంధీ

కొల్లామ్, మార్చి 30: కేరళలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఊపందుకున్నది. అధికార ఎల్డీఎఫ్, ప్రతిపక్ష యూడీఎఫ్ కూటమి నేతలు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మరోవైపు బీజేపీ కూడా కేరళలో జోరుగానే ప్రచారం కొనసాగిస్తున్నది. తాజాగా ఇవాళ కొల్లామ్ జిల్లాలోని కరుణగప్పల్లిలో కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన ప్రచార సభలో ఆ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ, తనయ పార్టీ జనరల్ సెక్రెటరీ ప్రియాంకాగాంధీ మాట్లాడారు.

అధికారం సాధించడమే లక్ష్యంగా కొంతమంది నేతలు చేసే హామీలను నమ్మి మోసపోవద్దని ఈ సందర్భంగా ప్రియాంకాగాంధీ ఓటర్లకు సూచించారు. తాము తప్పుడు హామీలకు మోసపోయే రకం కాదనే విషయాన్ని ఈ ఎన్నికల్లో మీరు దేశానికి చాటుతారని తాను భావిస్తున్నానని ప్రియాంకా పేర్కొన్నారు. తప్పుడు హామీలు ఇచ్చేవారని, అవినీతి పాలకులను, అధికార దాహమే తప్ప ప్రజాసేవ పట్టనివారిని అస్సలు నమ్మకూడదని ఓటర్లకు పిలుపునిచ్చారు.

